## విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి

**కీసర,మే30,ప్రభాతవార్త:**

విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలని మండల విద్యుత్ ఏఈ మురళిక్రిష్ణ కోరారు.మంగళవారం "ప్రభాతవార్త"తో ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 25వ తేదీలోపు విద్యుత్ బకాయిలు చెల్లించాలని కోరారు.విద్యుత్ వినియోగదారులు ఆలస్యంగా విద్యుత్ బకాయిలు చెల్లిస్తే అదనంగా రుసుం చెల్లించాల్సి వస్తుందన్నారు.సకాలంలో విద్యుత్ చెల్లించని ఎడల విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు.ఏప్రిల్ నెల విద్యుత్ బిల్లులను ఈ నెల 31వ తేదీ (నేడు) చెల్లించాలని కోరారు.లేని ఎడల విద్యుత్ సరఫరా నిలిపి,అదనంగా రుసుం వేయబడునని తెలిపారు.విద్యుత్ బకాయిలు చెల్లించే వారిలో ఎక్కువగా గృహప కరాల దారులు,దుఖాణదారులు ఉన్నారని తెలిపారు.మండల వ్యాప్తంగా 70 లక్షల రూపాయలు బకాయిలు ఉన్నాయని ఏఈ ముర ళిక్రిష్ణ తెలిపారు.విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## నందిగామలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి

### -హాజరైన రాజకీయ ప్రముఖులు ,అధికారులు



నందిగామలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్,తదితరులు

**నందిగామ మే30,ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన నందిగామలో డిఎల్ఎఫ్ గాయత్రి గార్డెన్‌లో 33/11కేవి విద్యుత్ ఉప కేంద్రాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర క్రీడలు,ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్థానిక ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ,ఎంపి మన్నె శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జడ్పిచైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి,జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్,కేశంపేట .జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి,నందిగామ సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి,కేశంపేట ఎంపిపి వై.రవిందర్ యాదవ్,ఎస్టీ కమిషన్ చైర్మన్ వాల్యానాయక్,ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్,ఎఎంసి మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి,డిసిసిబి డైరెక్టర్ మంజులారెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు పద్మారెడ్డి, రాజ్యలక్ష్మి, రాంబల్ నాయక్,కోత్తూరు ఇంచార్జీ ఎంపిపి శోభాలింగం నాయక్,నందిగామ,చెగూరు సింగిల్ విండో చైర్మన్లు రాజ్ గోపాల్,గోర్లపల్లి అశోక్ మాజీ చైర్మన్ విఠల్,జిల్లా ఎస్ఈ గోపయ్య,షాద్‌నగర్ డి.ఇ యాదయ్య,ఎడిఈ రవిందర్ ,ఎఈ శ్రీధర్,ఇఇ నిర్దోష్ రెడ్డి,సర్పంచ్‌లు ఎనుగొండ రమేష్ గౌడ్,జెట్టావత్ రాజు నాయక్ ,చంద్రారెడ్డి,నాయకులు ఎమ్మె సత్యనారాయణ,దేవెందర్ యాదవ్,మేకం రాజు,బుయ్యనీ విరేందర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎంల పరిశీలన పనులు చేపట్టాలి

### -జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

జూన్ 12 నుండి 22వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవిఎం)ల మొదటి విడత పరిశీలన పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు.మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కన గల ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని 1130 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు,బ్యాలెట్ యూనిట్స్,కంట్రోల్ యూనిట్స్,వివిప్యాడ్‌లన్నింటిని సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా పరిశీలించాలన్నారు.మొదటి విడత పరిశీలనలో భాగంగా ఐదు శాతం ఓటింగ్ యంత్రాలపై 500 నుండి 1200 వరకు మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు.సక్రమంగా పనిచేయని యంత్రాలను త్రిపి పంపించడం జరుగుతుందన్నారు.యంత్రాల మొదటి విడత పరిశీలనకు వచ్చే సిబ్బంది అందరికీ అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ,అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ,అమిత్ ,తహసీల్దార్ రాజేందర్ రెడ్డి,ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్,రవీందర్ ,దత్తు,వివిధ పార్టీల ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.



# చెట్లు పెరిగాయి..గట్లు బలహీన పడ్డాయి


### -మావైపు చూడరా సారు -ప్రశ్నార్థకంగా మారిన చెర్వుల భవిష్యత్తు ?

**కందుకూరు, మే 30, ప్రభాతవార్త:**

ఏపుగా పెరిగిన చెట్ల వలన చెర్వుల, కుంటల కట్టలు ప్రమాద భరితంగా మారాయి. గత కొన్ని సంవత్సరాల కాలంగా మరమ్మత్తులు చేపట్టకపోవడం వలన కట్టల పటిష్టతక ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయాలను సంబంధిత శాఖల అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతుందని స్తానికులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు మండలంలో మైనర్ ఇరిగేషన్‌కు సంబందించి 8 ప్రాజెక్టులు అందులో 6 చెర్వులు ఉండగా 2 కత్వలు ఉన్నాయి. మీర్ఖాన్‌పేట మైలమ్మ చెర్వు, తిమ్మాపురం తిమ్మచెర్వు, రాచులూరు సందెమ్మచెర్వు, కందుకూరు సున్నంచెర్వు, జైత్వారం నాయినివాని చెర్వు, శాయిరెడ్డిగూడ పెద్దిరెడ్డిచెర్వు లు నిర్మానాలు మట్టితొ కట్టలతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రాంతంలో ప్రదాన జలాశయాలు లేకపోవడం వలన చిన్ననీటి ప్రాజెక్టులకు ప్రాదాన్యత ఇచ్చారు. సమైఖ్య రాష్ట్రంలో పాలకుల నిర్వాకం వలన చిన్ననీటి వనరులు నిరాదరణకు గురైనాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మిషన్ కాకతీయ కార్యనక్రమాన్ని చేపట్టి చుర్వుల, కుంటల పునరుద్దరణ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. అ సమయంలో చెర్వులలో పూడిక తీత పనులు నిర్వహించి కట్టల పటిష్టతకు చర్యలు తీసుకుంది. భూగర్బ జలాలను పెంచడానికి నీటివృదాను కాపాడుటకు పాలకులు ఇటీవల కాలంలో చెర్వులకింద ఉండే పారువాటకం పంట పొలాలకు నీటిని విడుదల చేయకుండా అధికారులు తూములను మూసివేయడం జరిగింది. గత కొన్ని సంవత్సరాల కాలంగా కురుస్తున్న వర్షాల ప్రభావం నీటినిల్వలు కాపాడుటకు నీటిని విడుదల చేయక పోవడం వలన చెర్వులు కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. అయితే నీటినిల్వలను కాపాడుతు భూగర్బజలాలను పెంరుతున్నామని అనందపడుతున్న పాలకులు, అధికారులు చెర్వు కట్టల, కుంట కట్టల పటిష్టత ఏవిదంగా ఉన్నదో గుర్తించ లేకపోతున్నారు. చెర్వు కట్టలపైన మొలుస్తున్న చెట్లు మహా వృక్షాలుగా ఏపుగా ఎదుగడం వలన కట్టలు కారడవులను తలపిస్తున్నాయి. కనీసం ఈ చెర్వు కట్టలపైన ప్రజలు తిరుగాడే పరిస్తితులు లేకుండా పోతున్నాయి. కట్టలపైన ఏపుగా పెరిగిన చెట్ల వేర్లు మట్టి కట్టలలోకి చొచ్చుకు పోవడం వలన చెర్వుల, కుంటల మట్టి కట్టల పటిష్టత బాగా దెబ్బతింటుందని గత ఏడాదికి ఈయేడాదికి కట్టల పరిస్థితి దయనీయంగా మారిందని రైతులు వాపోతున్నా రు. గతయేడాది నీటినిల్వలు మే నెలలో యాబై శాతంపైగా ఉన్నవని ఈ యేడాది నీటినిల్వ కొన్ని చెర్వులలో 25 శాతం మాత్రమే ఉన్నదని రైతులు పేర్కోంటున్నారు. మల్లీ వర్షాకాలం సమీపించిందని చెర్వులలో ఇంకా నీటినిల్వలు ఉన్నాయి కాని కట్టల పటిష్టత ప్రశ్నార్ధకంగా మారిందని వారు పేర్కోంటున్నారు. చెర్వులు నీటితొ కలకల లాడుతుంటే చెర్వులలో, కుంటలలో చేపల పెంపకాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న పాలకులు కట్టల పటిష్టత విషయంలో మాత్రం జాగ్రత్త పడడం లేదని అయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గత కొన్ని సంవత్సరాల కాలంగా కట్టల మరమ్మత్తులకు చర్యలు తీసుకోకపోవడం వలన మండలంలో ఉన్న చెర్వుకట్టల, కుంటకట్టల పరిస్తితి దయనీయంగా ఉన్నదని మల్లి ఈ యేడాది వర్షాలు కురిసి చెర్వులలో కుంటలలో నీరు వచ్చి చేరితే నీటివత్తిడి ప్రభావం వలన అ మట్టికట్టలపై పడితే అ మట్టి కట్టలు ఎంత వరకు నిలబడగాయని ఏదైనా జరుగరానిది జరిగితే పరిస్థితులు ఎలా ఉంటాయని దానికి బాద్యత ఎవరు వహిస్తారని స్తానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పలువురు ప్రజా ప్రతినిదులు రైతులు సంబందిత ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెల్లగా కట్టలపైన చెట్ల ప్రభావం తీవ్రగా ఉన్నదని దానివలన కట్టలు బలహీనంగా తయారవుతాయని అయితే మరమ్మత్తులకు అవకాశం లేదని గ్రామాలలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకాన్ని ఉపయోగించి సంబందిత కూలీలచేత కట్టలపై పెరిగిన చెట్టను తొలగిస్తే బాగుంటుందని దానికి అయా గ్రామాల ప్రజా ప్రతినిదులు సంబందిత ఎన్ఆర్ఇజిఎస్ శాఖల అదికారులు చొరవచూపితే బాగుంటుందని ఇరిగేషన్ అధికారులు పేర్కోంటున్నారు. అయితే ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు నిబందనల ప్రకారం పనులు చేయించవలసి ఉంటుందని అ ప్రోవిజన్ లేదని వారు పేర్కోంటున్నారు. చెర్వుల, కుంటల కట్టల పటిష్టం చేయడంలో పాలకుల అవగాహనా రాయిత్యం శాఖల మద్య సమన్వయ లోపం వలన పరిస్తితులు దయనీయంగా మారాయని కట్టల పరిస్తితి ప్రశ్నార్ధకంగా మారిందని స్తానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత శాఖల అధికారులు చొరవచూపి వర్షాల తీవ్రత కాకముందే కట్టల పటిష్టతకు చర్యలు తీసుకుని ప్రజల అందోళనలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



మైలమ్మచెర్వు గట్లపైన ఏపుగా పెరిగిన చెట్లు



## ధాన్యం కొనుగోళ్ల నిలిపివేతపై కాంగ్రెస్ ఆందోళన

### -రాస్తారోకో, దిగివచ్చిన అధికారగణం



రాస్తారోకో నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు, రైతులు

**ప్రభాతవార్త, జిల్లా ప్రతినిధి :**

యాసంగి వడ్ల కొనుగోలు నిలిపివేతపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. తాండూరులో డీసీఎంఎస్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహారాజ్, పెద్దేముల్ జడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, జనార్ధన్‌రెడ్డి తదితర నేతలు ఖాంజాపూర్ గేటు వద్ద మార్కెట్ కమిటీ గిడ్డంగుల వద్దకు చేరుకుని రైతులుకు మద్దతుగా నిలిచారు. హైదరాబాద్–తాండూరు ప్రధాన రహదారిపై భైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. చివరి గింజ వరకు కొంటామని ప్రగల్బాలు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం వాస్తవానికి ఆచరణలో పెట్టడం లేదని రమేష్ మండిపడ్డారు. కొద్ది రోజులుగా రైతులు గంటల తరబడి సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ రైతుల గోడు పట్టించుకోవాల్సిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇలాంటి సమస్య వచ్చినపుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మిల్లర్లు, అధికారుల వైఖరి వల్ల రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా నిలుస్తుందని రమేష్ అన్నారు. ధారాసింగ్ మాట్లాడుతూ గత రెండేడ్లుగా మిల్లర్ల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం బియ్యం సేకరణ జరుగడం లేదని విమర్శించారు. పీడీఎస్ రైస్‌ను సేకరించి మిల్లర్లు మాయాజాలానికి పాల్పడినా అధికారులు ఎక్కడా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. యాసంగి వడ్ల సేకరణలో అధికారుల తీరు మారకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా సమాచారం తెలియగానే తాండూరు తహసీల్దార్ చినఅప్పలనాయుడు, ఆర్ఐ రాజిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని రైతును, కాంగ్రెస్ నేతలను సముదాయించారు. ప్రతి సెంటర్లో వడ్లు కొంటున్నామని, కొన్ని కేంద్రాలలో అనివార్య కారణాల వల్ల నిలిచిపోవచ్చని అన్నారు. ఇకపై ఎక్కడా పొరపాటు జరుగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అప్పటికే యాలాల ఎస్సై అరవింద్, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ సిబ్బంది అక్కడికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల మేరకు వాహనాలు ఎక్కడి కక్కడే నిలిచిపోయాయి.

## జిల్లాలో చేపట్టిన పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, మే 30, (ప్రభాతవార్త) :**



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్న అధికారులు

రంగారెడ్డి జిల్లా సందర్శనకు వచ్చిన జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ బృందం సభ్యులు అంకిత్ మిశ్రా, డిప్యూటీ సెక్రటరీ, అంకిత్ విశ్వకర్మ, సైంటిస్ట్ జిల్లా యంత్రాంగం తరపున అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లాకు ఆహ్వానించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. జలశక్తి అభియాన్ ద్వారా రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వార అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ జలశక్తి అభియాన్ బృందానికి వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో జలశక్తి అబియాన్ ద్వారా నీటిని నిల్వ ఉంచే ప్రయత్నంలో ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోరుబావులు, చెరువుల చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేసుకొని నీటి ఒడిసి పట్టి జిల్లాలో వరి పంటలు, పండ్లు, పువ్వులు సాగు చేయుచున్న విధానము బృందానికి విరించారు. జిల్లాలో తాగునీటి, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉందని తెలిపారు. జిల్లాలో 558 గ్రామ పంచాయతీలలో తెలంగాణకు హరిత హారం కార్యక్రమం ద్వార మొక్కలు నాటి, నాటిన మొక్కలను సంరక్షణ చేస్తూ పచ్చదనం పెంచడం జరుగుతుందని అన్నారు. గ్రామ నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందిండం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, అడిషనల్ పీడీ నీరజా, వ్యవసాయా శాఖ ఉద్యన శాఖ మిషన్ భగీరథ, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధింత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాములగుట్ట ఆలయంలో విగ్రహాల,యంత్ర ప్రతిష్టలు

### -మరో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు
### -లక్ష్మాపూర్ గామంలో విగ్రహాల ఊరేగింపు
### -శ్రీసీతారామచంద్రస్వామిల ఆలయం ముస్తాబు



లక్ష్మాపూర్ గ్రామంలోని శ్రీరాములగుట్ట ఆలయంలో విగ్రహాలు,యంత్ర ప్రతిష్ట కార్యక్రమాల సందర్భంగ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసిన దృశ్యం



విగ్రహాల ప్రతిష్ట సందర్భంగ లక్ష్మాపూర్‌లో విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి ఆ తరువాత ఆలయంలో పూజలు నిర్వహించిన దృశ్యం

**శామీర్‌పేట, మే 30, ప్రభాతవార్త :** లక్ష్మాపూర్‌లోని శ్రీరాములగుట్ట (శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం)లో విగ్రహాల,యంత్ర ప్రతిష్టల సందర్భంగ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలోని శ్రీరాములగుట్ట ఆలయం వద్ద విగ్రహాల యంత్ర ప్రతిష్టల సందర్భంగ మూడు రోజుల పాటు జరిగే ప్రత్యేక పూజలు ప్రారంభమైనాయి. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో శ్రీరాములగుట్ట ఆలయంలో విగ్రహాల,యంత్ర ప్రతిష్టలను పురస్కరించుకుని యజ్ఞహోమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. లక్ష్మాపూర్ గ్రామంలో విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 30,31, జూన్1 తేదీలలో మూడు రోజుల పాటు విగ్రహాల ప్రతిష్ట సందర్భంగ శ్రీరాములగుట్టలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. గుట్టపైన ఆలయం ఉండటంతో శ్రీరాములగుట్టగా పిలవబడుతూ భక్తులను ఆకట్టుకుంటుంది. జూన్ 1న విగ్రహ,శిఖర,యంత్ర ప్రతిష్టలు ఉన్నందున ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొంటున్నారు. శ్రీసీతారామచంద్రస్వామి వారి యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్టా మహోత్సవాలు వైదిక నిర్వాహకులు శ్రీపరాంకుశం వెంకట సీతారామాచార్యుల ఆధ్వర్యంలో జరుగనున్నాయి. శ్రీరాములగుట్టకు శ్రీసీతారామాచంద్రస్వామిలు వెలిసినందున యంత్ర ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అదే విధంగ శ్రీవినాయక, శ్రీహనుమాన్, శ్రీనందీశ్వరుల విగ్రహాల ప్రతిష్ట జరుగనున్నట్లు శ్రీరాములగుట్ట దేవస్థాన కమిటీ, లక్ష్మాపూర్ గ్రామ ప్రజలు పేర్కొన్నారు. శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం (శ్రీరాములగుట్ట) అంత భక్తి పారవశ్యంతో, ఆకర్షణీయ వాతావరణంలో ఉంటూ విద్యుత్ దీపాలతో అలంకరించ బడి ఆలయ ప్రాంగణం అంత కూడ భక్తులను ఆకట్టుకుంటుంది.

## దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలి

### -మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని పంచాయతీ రాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు.మంగళవారం సచివాలయం నుండి ఉన్నతాధికారులతో కలిసి అదనపు కలెక్టర్లు,జిల్లా మండల,గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...జూన్ 2వ తేది నుండి 22వ తేదివరకు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలను పెద్ద మొత్తంలో భాగస్వామ్యం అయ్యేవిధంగా చూడాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక సాధించిన అభివృద్ధి చేసిన పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు.పల్లె ప్రగతి ద్వారా గ్రామానికి వచ్చిన నిధుల వివరాలను వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు జరిగిన లబ్ధి గురించి తెలియజేయగలరు.గ్రామాల్లో నిర్మించిన మౌలిక వసతుల వివరాలను ప్లెక్సీల రూపంలో ప్రదర్శించాలని సూచించారు.గ్రామపారిశుధ్యం పచ్చదనం తీరును వివరించాలని అదేవిధంగా జాతీయస్థాయిలో సాధించిన అవార్డుల గురించి కూడా తెలియజేయాలని మంత్రి తెలిపారు.ఫోటోలతో పాటు బ్రోచర్ల తయారుచేసి గ్రామాలో పంచాలని ఆయన తెలిపారు.ఉత్తమ గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు ఉత్తమ మండలాల ఎంపిలకు సన్మాన కార్యక్రమం చేపట్టాలని తెలిపారు.గ్రామ పారిశుధ్య పనులు మెరుగైన సేవలు అందించిన కార్మికులకు సన్మానించడంతో పాటు ప్రశంసా పత్రాలను ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ,ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్,సీఈఓ జానకి రెడ్డి,డిపిఓ తరుణ్ కుమార్,డిఆర్‌డిఎ అడిషనల్ పీడి స్టీవెన్ నీల్,డిప్యూటీ సీఈఓ సుభాషిని, డిఎల్పీఓ అనితలు,పాల్గొన్నారు.

## ఘనంగా దేవతా విగ్రహాల ఊరేగింపు

**బొంరాస్‌పేట్,మే 30ప్రభాతవార్త**

మండల పరిధిలోని నాందార్‌పూర్ గ్రామంలో అయుదాలపల్లి అంజనేయ స్వామి ఉత్సవాలు రెండోరోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మంటపారాధన,విహితహవనములు,పుహస్నపనము,శయ్యధాన్యాధివాసములు,మంత్రపుష్పస్వస్తి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం దేవతా విగ్రహాలను ట్రాక్టర్‌పై ఊరేగింపులు చేశారు.గ్రామంలోని వీధుల గుండా విగ్రహాల ఊరేగింపులో అడపడుచులు స్వామివారికి బిందెలతో జలాభిషేకం చేస్తు ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.కార్యక్రమంలో డప్పులు,డోళ్ళ చప్పుళ్ళు మద్యలో ఒగ్గు డోలు విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. భక్తులు జైశ్రీరాం..జైహనుమాన్ నినాదాలతో పురవీధుల్లో ఊరేగింపు చేయగా ఊరిలో పండుగ వాతావరణం నెలకొంది.కార్యక్రమంలో గ్రామ ప్రజలు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామంలో దేవతా విగ్రహాల ఊరేగింపు దృశ్యం

## అన్నోజీగూడలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, మే 30, ప్రభాతవార్త:**

గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోచారం మున్సిపల్ అన్నోజీగూడ ఫుట్‌ఓవర్ వంతెన వద్ద ఒక వ్యక్తి పడి ఉన్నాడని 100 డయల్ ద్వారా ఘట్‌కేసర్ పోలీసులకు సమాచారం రావడంతో వారు చేరుకొని పరిశీలించి 108 అంబులెన్స్‌కు తెలియజేయడంతో సిబ్బంది వచ్చి వ్యక్తిని పరిక్షించి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడు 40 సంవత్సరాలు ఉంటాడని, 5 అడుగుల ఎత్తు, ఆకుపచ్చరంగు టిషర్ట్, బ్రౌన్‌కలర్ నైట్‌ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలపారు. స్థానికంగా విచారించగా అన్నోజీగూడ, శ్రీలక్ష్మి నర్సింహ్మకాలనీ పరిసరాల్లో బిక్షాటన చేసుకుంటూ రోడ్డు వెంట తిరిగేవాడని తెలిసిందని, అనారోగ్యం కారణంగానే చనిపోయాడని ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ పోలీసులు పేర్కొన్నారు.



ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతిజ్ఞచేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

## దశాబ్ది ఉత్సవాలు అదిరిపోవాలి : ఎమ్మెల్యే

**పటాన్‌చెరువు, మే 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తవుతున్న శుభసందర్భంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జూన్ 2వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన దశాబ్ది ఉత్సవాలలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ వేడుకలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్‌చెరువు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను పల్లెపల్లెలో ప్రతి ఒక్కరికి తెలిసేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను రంగురంగుల దీపాలతో అలంకరించాలని కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు దశాబ్ది కాలంలో సాధించిన ప్రగతిని నివేదికల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం



ఆత్మీయసమ్మేళనం విజయవంతంచేయాలని ప్రచారంచేస్తున్న నాయకులు

**న్యాల్‌కల్, మే 30, ప్రభాతవార్త:** ఈ నెల 31వ తేదీన నిర్వహించే బిఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి పార్టీ కార్యకర్తపై ఉందని బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మున్నూర్ రవీందర్ అన్నారు. మంగళవారం హద్నూర్, గంగ్వార్, మెటల్‌కుంట, హుసెల్లి, న్యామతాబాద్ తదితర గ్రామాల్లో కార్యకర్తలకు సమ్మేళనం విజయవంతంపై అవగాహన కల్పించారు. మండలంలోని 19 గ్రామాల(హద్నూర్ సొసైటీ పరిధిలోని గ్రామాలు) వారితో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నారు. సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు రవీందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హద్నూర్ సొసైటీ డైరెక్టర్, హద్నూర్ గ్రామ కమిటి అధ్యక్షుడు యంఆర్ ప్రవీణ్‌కుమార్, బోద భాస్కర్, నిరంజన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాల విజయవంతంపై అవగాహన

**-అధికారులతో మండల ప్రత్యేక అధికారి రాఘవరావు**



మాట్లాడుతున్న రాఘవరావు

**న్యాల్‌కల్, మే 30, ప్రభాతవార్త:** జూన్ 2నుంచి 22వ తేదీవరకు రాష్ట్ర దశాబ్ది అవతరణ ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల ప్రత్యేకాధికారి, డిఎల్‌పిఓ రాఘవరావు సూచనలు చేశారు. న్యాల్‌కల్‌లోని మండలపరిషత్ కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ 20 రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చేయాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి, ఎంపిఓ సురేష్, ఉపాధి హామి ఏపిఓ రంగారావు, ఇందిరా క్రాంతి పథకం ఏపిఓ కుమార్ పాల్గొన్నారు.

## పెద్దాపూర్ ఎరువుల దుకాణంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



పెద్దాపూర్‌లో ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

**సదాశివపేట, మే 30, ప్రభాతవార్త:** మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలోని రికార్డులను ఏడిఏ శ్రీనివాస్‌ప్రసాద్, మండల వ్యవసాయాధికారి అనిత, ఎస్ఐ గోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఓ శ్రీనివాస్ దుకాణం నిర్వాహకులకు పలు సూచనలుచేశారు. ప్రభుత్వం నిషేధించిన మందులను, ఎరువులను, విత్తనాలు అమ్మకూడదని హెచ్చరించారు. దుకాణంలో కొనుగులో చేసిన రైతులకు సంతకాలతో కూడిన రశీదులను అందించాలన్నారు. అవినీతికి పాల్పడితే డీలర్లపై చర్యలు తప్పవని శ్రీనివాస్ హెచ్చరించారు.

### ఘనంగా ఎల్లమ్మ జమదగ్ని విగ్రహ ప్రతిష్ట, కళ్యాణోత్సవం

**వెల్దుర్తి, మే 30 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలం దామరాంచ గ్రామంలో రేణుక ఎల్లమ్మ జమదగ్ని విగ్రహ ప్రతిష్ట, కళ్యాణోత్సవంలో భాగంగా మంగళవారం గ్రామస్థులు విగ్రహాలను ఊరేగించారు. కళ్యాణోత్సవంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతంచేయాలని గౌడ కులస్తులు కోరారు. ఈ నెల 4న విగ్రహ ప్రతిష్ట. కళ్యాణోత్సవం జరుగుతుందని వారు తెలిపారు.

## ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయింపు**

**గుమ్మడిదల, మే 30, ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాలు రాక రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మడిదలలోని టోల్‌ప్లాజా వద్ద రైతులతో కలిసి కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుపక్షపాతి అని రైతులు పడుతున్న పడి కాపులు కళ్ళకు కనపడతలేదని ప్రశ్నించారు. వాహనాలు లేక ధాన్యం కల్లాలలో వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామాలలో ఉన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి వాహనాల ద్వారా రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన రైతులు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గోవర్ధన్‌గౌడ్, రైతు సంఘం అధ్యక్షులు పి.మోహన్ రెడ్డి, మైపాల్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రంగారెడ్డి, దయాకర్‌రెడ్డి, సందీప్, అఖిల్, రాజు, వీరయ్య, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



టోల్ ప్లాజా వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

# వాయు కాలుష్యంతో గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరి

**పారిశ్రామిక ప్రధాన రహదారిపై బైఠాయించి గడ్డపోతారం గ్రామస్తులు.. కిలో మీటర్ మేర నిలిచిపోయిన వాహనాలు**

**జిన్నారం, మే 30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని పరిశ్రమలు విచ్చల విడిగా వాయుకాలుష్యాన్ని విడుదల చేస్తుండడంతో నెలరోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉదయం పారిశ్రామికవాడకు వెళ్లే రహదారిపై బైఠాయించి పరిశ్రమలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కొన్ని రోజులుగా వాయు కాలుష్యం అధికమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉందని తగు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పరిశ్రమల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని పరిశ్రమలు జల వాయు కాలుష్యాన్ని విచ్చలవిడిగా విడుదల చేస్తూ స్థానికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఈ పరిశ్రమలకు కొంతమంది నాయకులు, అధికారులు వత్తాసు పలుకుతూ నిర్లక్ష్యధోరణిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనికి ఇప్పటికైనా కట్టడి చేసి కాలుష్యం నివారణ అరికట్టాలని లేనిపక్షంలో పరిశ్రమం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.





రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు, భారీగా నిలిచిపోయిన వాహనాలు

## నూతన పోలీసు ఠాణా భవనం పరిశీలన



నూతన పోలీసు ఠాణా భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, మే 30, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న కొల్లూరు పోలీసు ఠాణా భవనాన్ని మంగళవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. కొత్త భవనం ఏర్పాటు అయ్యే వరకు తాత్కాలిక పోలీసు స్టేషన్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో పోలీసుస్టేషన్‌ను ప్రారంభోత్సవం చేసేందుకు సన్నిహాలు చేస్తున్నట్లు వివరించారు. నూతన పోలీసుస్టేషన్ ఏర్పాటుతో తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూర్ ప్రజలకు పోలీసుల సేవలు సత్వరం అందుబాటులోకి వాస్తయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, సీఐ సంజయ్, స్థానిక కౌన్సిలర్ చిట్టి ఉమేష్, బిఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్టడీ సర్కిల్ కార్యవర్గం



అంబేద్కర్ స్టడీ సర్కిల్ కార్యవర్గం

**జహీరాబాద్, మే 30, ప్రభాతవార్త:** అంబేద్కర్ స్టడీ సర్కిల్ డివిజన్ కార్యవర్గాన్ని సోమవారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షులు మొగులయ్య గౌతం అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షులుగా డి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నమ్మల కిష్టయ్య, సిహెచ్ మొగులయ్య, ఆర్ పాండు, ప్రధాన కార్యదర్శిగా ఎన్ రవికాంత్, కార్యదర్శులుగూ కె.వెంకయ్య,వై.అమృత్, కోశాధికారిగా కె.బిచ్చయ్య, ఫైనాన్స్ కమిటి సభ్యులుగా ఎస్ అశోక్‌కుమార్, కార్యదర్శులుగా గౌతం సంజీవ్‌కుమార్, సాంస్కృతి కార్యదర్శిగా బి నరసింహులు, స్పోర్ట్స్ కార్యదర్శిగా బి వసంత్, లైబ్రరీ కార్యదర్శిగా ముకుంద్ శిల్పి, కార్యవర్గ సభ్యులుగా డి విఠల్, మా దినం అంజయ్య, జి అశోక్‌కుమార్ బి వెంకటేశం, బి కృష్ణ, గోవర్ధన్, మారుతి, వంశీ, జి నర్సింలు, ముఖ్య సలహాదారులుగా రామచందర్ భీంవంశీ, బి నర్సయ్య, ఎం అశోక్‌కుమార్, మొగులయ్య గౌతం, బి బిచ్చయ్యలను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షులుగా ఎన్నికైన డి శ్రీనివాస్ పేర్కొన్నారు.

### రైతులకు జనము విత్తనాలు : పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి

**శివ్వంపేట, మే30 ప్రభాతవార్త:** మండలంలోని రైతులందరికీ స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం కార్యాలయంలో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి అన్నారు. దీని యొక్క ధర రూ. 3,500 కాగా బస్తా 40 కేజీలు ప్రభుత్వం ఇస్తున్నప్పటికీ సబ్సిడీ 65 శాతంపోనూ రూ. 1,225 రైతులకు అందించడం జరుగుతుందని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. అదేవిధంగా వారం రోజుల్లో పూర్తి స్థాయిలో వడ్ల కొనుగోళ్లు పూర్తి చేస్తామని, రైస్‌మిల్లుల్లో అన్‌లోడింగ్ సమస్య ఉన్నందున రైతులు అధైర్యపడవద్దని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి డైరెక్టర్ బానోత్ రవినాయక్, డీసీసీబీ మేనేజర్ విజయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణాకర్, డైరెక్టర్లు అంజిరెడ్డి, పెంటాగౌడ్, సీఈవో మధు, దామోదర్‌రెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



జనుము విత్తనాల బస్తాలను అందజేస్తున్న చైర్మన్ వెంకట్రామిరెడ్డి

## బాధిత కుటుంబాలను పరామర్శించిన రోహిత్

**పాపన్నపేట, మే 30, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు మృతి చెందిన దర్గాగౌడ్ కుటుంబ సభ్యులను ఎమ్మెస్ఎస్వో చైర్మన్ మైనంపల్లి రోహిత్ పరామర్శించారు. మంగళవారం రోహిత్ మైనంపల్లి మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైరం చెప్పారు. ఈ సందర్భంగా రోహిత్ మైనంపల్లి మాట్లాడుతూ ఒకే కుటుంబంలో రోడ్డు ప్రమాదంలో 4గురు వ్యక్తులు తిరిగిరాని లోకాలకు చేరిపోవడం బాధాకరమన్నారు. దుర్గాగౌడ్ కుమారుడు నిశ్వంత్, నాగరాజుగౌడ్ కుమారుడు నిశ్విత్ పేర్లపై రూ. 50 వేల చొప్పున డిపాజిట్ చేస్తామని హామి చేశారు. ఇద్దరి చదువు బాధ్యత ఎమ్మెస్ఎస్వో తీసుకుంటుందని హామి చేశారు. తల్లి రామవ్వకు అప్పటికి అప్పుడు 10వేల రూపాయలను అందచేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పుల్లన్నగారి ప్రశాంత్‌రెడ్డ, కో-ఆప్షన్ సభ్యులు గౌస్, సర్పంచ్‌లు శ్రీనాథ్ దాసు, సుధాకర్, గ్రామ ఉప సర్పంచ్ అజయ్, గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షులు పుట్టి సిద్దయ్య, ఏడుపాయల ఆలయ కమిటి డైరెక్టర్ నీరుడి సిద్దిరాములు, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్, డైరెక్టర్ తాడేపు మహిపాల్, మాజీ ఎంపిటిసి సభ్యులు గొల్ల బాలయ్య, ఏడుపాయల మాజీ డైరెక్టర్ దాసరి శ్రీధర్, నాయకులు కటికం బాలయ్య, పోచా గౌడ్, ప్రభుగౌడ్, నీరుడి మల్లేశం, నీరుడి రమేష్, శేఖర్ గౌడ్, వివేకానంద ఉవజన సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

**మూడు కుటుంబాలకు ఆర్థిక సహాయం...**

ఇటీవల మృతి చెందిన మండలంలోని ఎల్లాపూర్ గ్రామంలోని మూడు కుటుంబాల సభ్యులను మంగళవారం రోహిత్ మైనంపల్లి పరామర్శించారు. ఎల్లాపూర్‌లో యువకులు మంగన్న సతీష్, మఠం ఎల్లం, చిన్నన్న మురళి మృతి చెందిన విషయం తెలుసుకున్న రోహిత్ మైనలంపల్లి కుటుంబ సభ్యులను పరామర్శించి 5వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందచేశారు. చిన్నన్న కిషన్‌కు నిత్యావసర సరుకులను అందించారు.

### దశాబ్ధి ఉత్సవాలను విజయవంతం చేయాలి : ఎంపిపి



మాట్లాడుతున్న ఎంపిపి జంగం శ్రీనివాస్

**పెద్దశంకరంపేట, మే30 ప్రభాతవార్త:** దశాబ్ధి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఉత్సవాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2 నుండి 22వ తేదీ వరకు నిర్వహించే దశాబ్ధి ఉత్సవాలను పకడ్బంధీగా నిర్వహించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి రోజు వారి కార్యక్రమాలను విజయవతం చేయాలని ఆయన సూచించారు. జూన్ 8వ తేదీన ఊరూర చెరువుల పండుగ సందర్భంగా చెరువుల వద్ద బతుకమ్మ, బోనాలతో వివిధ సాంస్కృతి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.

**సమన్వయంతో పనిచేయాలి: ఎంపీడీవో**

అధికారులు, ప్రజాప్రతినిదులు సమన్వయంతో ఈ వేడుకలను నిర్వహించాలని ఎంపీడీవో రఫీక్ ఉన్నీసా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి విఠల్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణ భూమిపూజకు ముదిరాజ్‌లు తరలిరావాలి

**చిన్నశంకరంపేట, మే 30, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో నిర్మించే ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ భూమిపూజకు మండల నాయకులు పెద్దఎత్తున తరలి రావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం వారు చిన్నశంకరంపేటలో మాట్లాడుతు జూన్ 5న మంత్రి హరిష్‌రావు, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి భూమి పూజ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి క్రృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింలు,జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశం, గోపాలక్రిష్ణ, పెంటయ్య,బాబు,రాధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణ

# దశాబ్ధి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి : ఎంపిపి

**అల్లాదుర్గం, మే 30 ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ధి ఉత్సవాలను 21 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎంపీపీ అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రోత్సాహకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ తెలియజేసే విధంగా దశాబ్ధి ఉత్సవాలను ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. మండల స్థాయిలో 3వ తేదీన రైతు వేదికల వద్ద సమావేశాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరచాలని పేర్కొన్నారు. 8వ తేదీన ప్రత్యేక కార్యక్రమం కింద ఊరూర చెరువుల పండుగను విజయవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతువేదికలో సమావేశానికి వేయి మంది రైతులు హాజరయ్యే విధంగా ప్రజాప్రతినిధులు చూడాలన్నారు. 21 రోజుల పాటు రాష్ట్ర అవతరణ దశాబ్ధి ఉత్సవాలను పండుగ వాతావరణంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించుటకు కార్యాచరణ రూపొందించుకొని అదికారులకు దిశానిర్ధేశం చేసినట్లు అల్లాదుర్గం ఎంపీడీవో శంకర్ తెలిపారు. రైతు దినోత్సవం సందర్భంగా రైతువేదికల్లో రైతులకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ప్రతి గ్రామం నుంచి రైతులను డప్పులతో ఘనంగా పండుగ వాతావరణంలో రైతు వేదికలకు తీసుకు రావాలని, అక్కడ ప్రభుత్వం ప్రతి రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న సహాయాన్ని తెలియజేయాలన్నారు. భోజన ఏర్పాట్లు ఉంటాయన్నారు. చెరువుల వద్ద బతుకమ్మ, బోనాలతో పాటు సాంస్కృతి కార్యక్రమాలు, కట్ట మైసమ్మ పూజ, భోజనాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తులసీరాం, వ్యవసాయ శాఖ అధికారి రాజేష్, ఇరిగేషన్ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామాల సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్ కుమార్‌రెడ్డి

### మహమ్మద్ అబ్దుల్ రెహ్మాన్ ఉజెర్త్‌కు డాక్టరేట్

**పటాన్‌చెరువు, మే 30, ప్రభాతవార్త:** విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యంపై విశ్లేషణ, దానిపై సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధక విద్యార్థి (రీసెర్చ్ స్కాలర్) మహమ్మద్ అబ్దుల్ రెహ్మాన్ ఉజెర్త్‌కు డాక్టరేట్ వరించింది. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, సహ పర్యవేక్షకుడు ప్రొఫెసర్ బి.బస్వరాజ్‌లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. అబ్దుల్ రెహ్మాన్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్లు తెలిపారు.

**గీతం ప్రాంగణంలోని చెట్లకు జియో-ట్యాగ్..**

గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని చెట్లు, మొక్కలు, పొదలు, తీగ జాతులకు మంగళవారం జియో-ట్యాగ్ చేశారు. వాటికి అమర్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆయా మొక్కల వృక్షశాస్త్ర, సాధారణ పేర్లతో కూడిన వివరాలతోపాటు వాటి వర్గీకరణ, పుష్ప లేదా ఫలాల వివరాన్ని లభిస్తాయన్నారు. మూడు నెలలుగా శ్రమించి గీతం మూడు ప్రాంగణాంలోని చెట్ల జాతులకు క్యూఆర్ కోడ్‌లను ట్యాగ్ చేస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ అర్కిటెక్చర్, విశాఖపట్నం సీనియర్ ప్రొఫెసర్ కె.మోహన్ తెలియజేశారు. ఈ జియో ట్యాగింగ్ కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ అర్కిటెక్చర్, హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబంధు కోసం ధరఖాస్తు చేసుకోండి : ఎవో

**న్యాల్‌కల్, 30, ప్రభాతవార్త:** కొత్తగా పట్టాపాసుపుస్తకాలు పొందిన, ఇంత వరకు రైతు బంధు అందుకోని రైతులు త్వరగా ధరఖాస్తులను అందచేయాలని మండల వ్యవసాయ అధికారి ఎన్ లావణ్య, న్యాల్‌కల్ ఏఈఓ ఈనా రాథోడ్‌లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. రైతు బంధు కోసం ధరఖాస్తు ఫారం, పట్టాదార్ పాసుపుస్తకం, పట్టాదారు ఆదార్‌కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్సు పత్రాలను ఏఈఓలకు అందచేయాలని వారు సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 5వందల మందికి పైగా రైతు బంధు కోసం ధరఖాస్తు చేసుకోవాల్సిన వారు ఉన్నారని, సదరు రైతులు వెంటనే ధరఖాస్తు చేసుకుంటూ వచ్చే రైతు బంధు వారి వారి బ్యాంక్ ఖాతాల్లో క్రెడిట్ అవుతుందని ఏఒ లావణ్య వివరించారు.

## జాతరలు తెలంగాణ సంస్కృతికి అద్దం పడతాయి

**- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**పాపన్నపేట, మే 30, ప్రభాతవార్త:** జాతరలు, పండుగలు తెలంగాణ సంస్కృతికి అద్దం పడతాయని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పాపన్నపేట మండలం పాతలింగయ్యపల్లి గ్రామంలో జరుగుతున్న బీరప్ప స్వామి జాతరకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో పత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాతలింగయ్యపల్లి గ్రామస్తులు బీరప్ప స్వామి, కామరాతి కళ్యాణ మహోత్సవం వారంరోజులపాటు నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. గొల్ల కుర్మలతోపాటు కుల సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాణి కిష్టయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు కుమ్మరి జగన్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ధి ఉత్సవాలను విజయవంతం చేయాలి

**ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిడివో**

**కొల్చారం, మే30 ప్రభాతవార్త :** తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టి కృషితో విజయవంతం చేయాలని కొల్చారం ఎంపీపీ మంజుల కాశీనాథ్, జెడ్పీటీసీ మేఘమాల సంతోష్‌కుమార్, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం కొల్చారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో దశాబ్ధి ఉత్సవాల నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూన్ 2 నుండి 22 వరకు శాఖల వారీగా నిర్వహించే కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. పంచాయతీ కార్యాలయాలు, రైతువేదికలు, చెరువుకట్టలు, దేవాలయాలు, మసీదులు, ప్రార్థన మందిరాలను అందంగా ముస్తాబు చేయాలన్నారు. మొదటి రోజు గ్రామ పంచాయతీ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించాలన్నారు. 2014 తరువాత సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో కృష్ణవేణి, విద్యుత్ శాఖ ఏఈ హైమద్ అలీ, ఏపీవో మైపాల్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం సుశిల్వ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీలు, పంచాయితీ కార్యదర్శులు, వివిధ శాఖల అ ధికారులు పాల్గొన్నారు.

### వినియోగాన్ని విస్తృత పరచడమే లక్ష్యం

**శామీర్‌పేట మే30,ప్రభాతవార్త :** కీలకమైన మైలురాళ్లను సాధించామని ఫోన్ పే ప్రకటించింది.యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్‌లోకి రెండు లక్షల రూపే క్రెడిట్ కార్డులను విజయవంతంగా లింక్ చేసిన మొదటి డిజిటల్ పేమెంట్స్ యాప్‌గా ఫోన్ పే కంపెనీ అవతరించింది.దాంతో పాటు యుపిఐలో రూపే క్రిడిట్ ద్వారా రూ.150 కోట్ల టోటల్ పేమెంట్ విలువ (టిపివి) కలిగిన లావాదేవీలను కూడా పోన్ పే ప్రాసెస్ చేసింది.కస్టమర్లు మరియు మార్చంట్లు లాంటి వారి మధ్య తన వినియోగాన్ని విస్రృత పరచడం కోసం ఎన్‌పిసిఐతో భాగస్వామ్యం కుదుర్చుకుని రూపే క్రిడిట్ కోసం సమగ్ర సొల్యూషన్స్ స్యూట్‌ను అందించాలని పొన్ పే సంకల్పించింది.

### చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన డీఈవో

**వెల్దుర్తి, మే 30 ప్రభాతవార్త:** మండలపరిధిలోని చర్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మంగళవారం శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. సర్పంచి అశోక్‌రెడ్డితో పాటు గ్రామస్థులు నూతన పాఠశాల భవనం నిర్మించాలని వినతిపత్రం సమర్పించడంతో నూతన భవన నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి విద్యార్థుల సమస్యలు తీర్చాలని గ్రామస్థులు కోరారు.

### బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి తరలిరావాలి

**పెద్దశంకరంపేట, మే 30 ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం హైదరాబాద్‌లోని గోపనపల్లిలో నూతనంగా నిర్మించిన బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి మండల నుండి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలి రావాలని బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ మండల అధ్యక్షులు రామచంద్రచారి, నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు కిషన్‌రావు దేశ్‌పాండే, గౌరవ అధ్యక్షులు కృష్ణశర్మలు అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ బ్రాహ్మణ సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి బ్రాహ్మణులను ఆదుకుంటున్నారన్నారు. సంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సమాజం సేవాసంస్థ జిల్లా అధ్యక్షులు సురేష్ జోషి ఆదేశాల మేరకు అన్ని గ్రామాల నుండి బుధవారం గోపనపల్లిలో ప్రారంభించే సదన్‌కు బ్రాహ్మణులు పెద్దఎత్తున తరలి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, సభ్యులు రాములు, అనంతరాజశర్మ, సంతోష్‌శర్మ, ఫనిందర్, రంగారావు, నాగరాజ్‌శర్మ, మహేష్‌శర్మ, అభిలాష్, రామాచారి, సంగమేశ్వర్, రవీందర్ పాల్గొన్నారు.

### 2023లో గణనీయమైన వృద్ధిని సాధించింది

**మేడ్చల్ మే30,ప్రభాతవార్త :** ప్రముఖ డైవర్సిఫైడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ అబాన్స్ హోల్డింగ్స్ లిమిటెడ్ 2023 ఆర్థిక సంవత్సరంలోని నాలుగో త్రైమాసికానికి (క్యూ4) బలమైన ఆర్థిక పనితీరును ప్రకటించింది. కంపెనీ వివిధ ఆర్థిక కొలమానాలలో గణనీయమైన వృద్ధిని ప్రదర్శించింది. తద్వారా పరిశ్రమలో కీ ప్లేయర్‌గా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంది. 2023 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నికర లాభం రూ.70.3 కోట్లు ,2022 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రూ.61.8 కోట్ల నికర లాభంతో పోలీస్తే 2023లో 14శాతం వృద్ధి నమోదైనట్లు వెల్లడించింది.

## పౌర హక్కులపై అవగాహన అవసరం

**-ఎస్ఐ సంతోష్ కుమార్**



పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్ కుమార్

**ధారూర్ మే30,ప్రభాతవార్త :**
రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సంతోష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని కుమార్ పల్లి గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ...హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు చేపట్టి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు.కుల వివక్ష,అంటరానితనాన్ని నిర్మూలించాలని ,అన్ని కులాల వారితో సోదరభావంతో మెలగాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ వీరేశం,పంచాయతీ కార్యదర్శి యోగిత,సర్పంచ్ శ్రీనివాస్ ,శంకర్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటింటికి బిజెపి కార్యక్రమాన్ని మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించాలి

**-మహిళ మోర్చా అధ్యక్షురాలు సుజాత గౌడ్**



**శంషాబాద్ మే30,ప్రభాతవార్త :**
ఇంటింటికి బిజెపి పేరుతో చేపట్టే కార్యక్రమాన్ని మహిళా మోర్చా నాయకులు విజయవంతం చేయాలని జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షులు సుజాత సూచించారు.శంషాబాద్ మున్సిపల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు కోడూరు కుమారి ఆధ్వర్యంలో శంషాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి బిజెపి రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రేమ్ రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిషోర్,జిల్లా అధ్యక్షురాలు సుజాత హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావడానికి బిజెపికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.బిజెపి నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు మహిళా మోర్చా నాయకులు ప్రతి మహిళను కలిసి బిజెపి సిద్ధాంతాలు విధానాలు దేశ రక్షణ కోసం మహిళల రక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించాలని సూచించారు.భారత ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి దేశ ప్రజలు ఆకర్షితులై బిజెపికి పట్టం కడుతున్నారని తెలంగాణలో కూడా బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని సుజాత అన్నారు.బిజెపి విజయంలో మహిళలు కీలక పాత్ర వహించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాలతి,మహిళా మోర్చా నాయకులు ఇందిరా,రమ,లక్ష్మి,వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ,తదితరులు పాల్గొన్నారు.


## బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా పవన్ కుమార్



ఘట్‌కేసర్ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి చేతుల మీదుగా నియామకపు అందుకుంటున్న పవన్ కుమార్

**ఘట్‌కేసర్ రూరల్, మే 30, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా దోలి పవన్‌కుమార్‌ను నియమిస్తూ పార్టీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్ రావు ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. ఇట్టి నియమాకపు పత్రాన్ని అవుశాపూర్‌లో జరిగిన పార్టీ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి. విక్రం రెడ్డి చేతుల మీదుగా మండల పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ రావు పవన్‌కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు. మండలంలో పార్టీ విస్తరణ కొరకు కొత్తగా మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నియామకం చేపట్టినట్లు తెలిపారు.

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం



కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మహిళా మోర్చా అధ్యక్షురాలు

**తాండూరు, మే 30, ప్రభాతవార్త :** భారతీయ జనతాపార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహు శ్రీలత అన్నారు. మంగళవారం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహు శ్రీలత, బషీరాబాద్ మండల అధ్యక్షురాలు వీరమణి, జిల్లా ఉపాధ్యక్షురాలు హారతి, తాండూరు పట్టణ అధ్యక్షురాలు ఉమాదేవి, మండల అధ్యక్షురాలు వెంకటమ్మ, లావణ్య, భువనేశ్వరి, అనిత, స్వాతి, కవిత తదితరులు బషీరాబాద్‌తో పాటు కంసాన్‌పల్లి, మైల్వర్, మంతన్‌గౌడ్ తండా తదితర గ్రామాలలో పర్యటించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధాని నరేంద్ర మోడి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు.

## పట్నం క్రికెట్ టోర్నమెంటును విజయవంతం చేయాలి

**-మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు డివై నర్సిములు**

**పెద్దేముల్, మే 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పది సంవత్సరాలు కావస్తున్నందున పట్నం మహేందర్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంటును విజయవంతం చేయాలని మండల బిఆర్ఎస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు డివై నర్సిములు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డివై నర్సిములు మాట్లాడుతూ పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జూన్ 1 తేదిన పట్నం రినిష్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండవ బహుమతిగా రూ. 25 వేలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఇట్టి కార్యక్రమానికి ఆయా గ్రామాల క్రీడాకారులు, అభిమానులు,ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రగతిని చాటేలా ఘనంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు

**-దేశానికే ఆదర్శంగా తెలంగాణా సంక్షేమ పథకాలు**

**-తెలంగాణా విజయాలు నలుదిక్కులా చాటేలా దశాబ్ది ఉత్సవాలు**

**-ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

**కొడంగల్,మే 30ప్రభాతవార్త**
ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు అనంతీరం జిల్లాల్లో అన్ని రంగాల్లో జరిగిన ప్రగతిని చాటేలా ఘనంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలు నిర్వహించాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.మంగళవారం కొడంగల్ మండల కేంద్రంలోని రాఘువేంద్ర ఫంక్షన్‌హాల్‌లో కొడంగల్,కొడంగల్ మున్సిపల్,దౌల్తాబాద్ మండలాలకు సంబందించి తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల అవగాహన సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హజరై మాట్లాడారు.ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని సాధించి 9 సంవత్సరాల స్వయం పాలన పూర్తి చేసుకొని 10వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా జూన్ 2 నుంచి జూన్ 22 వరకు 21 రోజుల పాటు వైభవంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రతి రంగంలో దేశానికే ఆదర్శవంతంగా అద్భుత ఫలితాలు సాధించినట్లు చెప్పుకొచ్చారు.కేంద్ర ప్రభుత్వం ప్రకటించే గ్రామీణ అవార్డుల్లో తెలంగాణా అగ్రస్దానంలో నిలువడం జరిగిందన్నారు.దేశంలో ప్రప్రథమంగా ఇంటింటికి త్రాగునీరు అందించిన మిషన్ భగీరథ పథకం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.ప్రజలకు త్రాగునీరు,విద్యుత్ వంటి కనీస మౌలిక వసతులు కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తెలంగాణా రాష్ట్రం అవిర్బవించి 9 సంవత్సరాల ముగిసే నాటికి అన్ని రంగాల్లో సమూల మార్పులు సాధించామని,నీటి పారుదల రంగంలో సాధించిన ప్రగతికి ప్రపంచ వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయని గుర్తుచేశారు.కరెంట్ కష్టాలతో ఇబ్బంది పడ్డ తెలంగాణా నేడు 24 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. నీటిపారుదల, విద్యుత్ రంగాల్లో సాధించిన విజయాల కారణంగా సాగు విస్తీర్ణం పెరిగి నేడు భూములకు భారమైన స్దాయిలో వరిపంట పండించడం జరుగుతుందన్నారు.గతంలో ప్రభుత్వ వైద్య రంగంపై ఉన్న అపోహలను తొలగిస్తు ప్రజలకు భరోసా కల్పించేలా వైద్య రంగం అభివృద్ది చేశామని,ప్రతి జిల్లాల్లో వైద్య కళాశాల ఏర్పాటు,మాతా శిశు సంరక్షణ అసుపత్రులు,డయాలసీస్ కేంద్రాలు,డయాగ్నిస్టిక్ హబ్,బస్తీ దవాఖానాలు,పల్లె దవాఖానాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని,కేసీఆర్ కిట్, కంటి వెలుగు లాంటి అద్భుత కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశామని చెప్పుకొచ్చారు.అలాగే విద్యా రంగం,గ్రామీణాబివృద్ధి,మున్సి పాలిటీల్లో అద్భుతమైన ప్రగతి సాధించామని,గ్రామీణ అభివృద్దిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చిన అవార్డుల్లో తెలంగాణా రాష్ట్రం అధిక సంఖ్యలో అవార్డులు రావడం జరగిం దన్నారు.సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజాప్రతినిధులు,అధికారుల సమన్వయంతో పని చేయడం వల్లనే ప్రతి రంగంలో తెలంగాణా అద్భుత ఫలితాలు సాధించిం దని,మన ప్రగతిని నలు దిక్కులా ఘనంగా చాటుతూ పకడ్బందీగా దశాబ్ది ఉత్స వాలు నిర్వహించాలని ఎమ్మెల్యే అన్నారు.కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే గురునా థ్‌రెడ్డి,కొడంగల్ మున్సి పల్ చెర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి,కొడంగల్,దౌల్తాబాద్ ఎంపీపీలు ముద్దప్ప దేశ్‌ముఖ్,పటేల్ విజయ్‌కుమార్,దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మున్సిపల్ వైస్‌చెర్మెన్ ఉషా రాజేందర్,కౌన్సిలర్లు మధుసుదన్‌యాదవ్, రమేష్,రహేత్‌బేగం,మునీర్‌లతో పాటు ఆయా మండలాల అధికారులు పాండు,రవీందర్, నాయకులు దామోదర్‌రెడ్డి, బి. మో హన్‌రెడ్డి,సిద్దిలింగప్ప, పకీరప్ప,బస్వరాజ్, నరోత్తంరెడ్డి,భీములు పాల్గొన్నారు.

### బొంరాస్ పేట్ మండలంలో....

**బొంరాస్‌పేట్,మే 30ప్రభాతవార్త :** తెలంగాణా అవతరణ దినోత్సవం సందర్బంగా నిర్వహించనున్న తెలంగాణా దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.మంగళవారం స్దానిక ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణా అవతరణ దినోత్సవం సందర్బంగా దశాబ్ది ఉత్సవాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు,ముఖ్య నాయకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతు నియోజకవర్గ వ్యాప్తంగా జూన్ 2 నుంచి 22వ తేది వరకు 21 రోజుల పాటు తెలంగాణా అవతరణ దినోత్సవం సందర్బంగా ప్రతి పల్లెన,ప్రతి వాడన ఘనంగా రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలన్నారు.21 రోజుల పాటు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ హేమీభాయి,పీఏసీఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు చాంద్‌పాషా,కోట్ల యాదగిరి,నాయకులు శేరినారాయణరెడ్డి,మహేందర్‌రెడ్డి,టీటీ.రామునాయక్,ఎంపీడీఓ పాండునాయక్‌లతో పాటు ఆయాశాఖల అధికారులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సభకు హాజరుకాకపోతే చర్యలు తప్పవు

**-మేడ్చల్ ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి సీరియస్ వార్నింగ్**

**-మేడ్చల్ సర్వసభ్య సమావేశం**



మేడ్చల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

**మేడ్చల్, మే 30. ప్రభాతవార్త :**
మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని, అధికారులు సమావేశాలకు హజరు కాకపోవడంతో ప్రజా సమస్యల పరిష్కారికి ఆటంకం కలుగుతున్నదని మేడ్చల్ ఎంపిపి రజితా రాజమల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించా రు.ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ నివేదికను సభ్యులకు వివరించారు. అందులో భాగంగా పలు సమస్యలపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ముఖ్యంగా పాఠశాలల ప్రారంభం కాబోతున్న సందర్భంగా ప్రతి గ్రామానికి విద్యార్థులకు అవసరమగు బస్సులను నడపాలని తెలియజేశారు. విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, స్థంబాలు లేకపోవడం, వేలాడుతున్న వైర్లను సరిచేయడంలో అధికారుల అలసత్యం ఉందని పలువురు అన్నారు. అనం తరం ఎంపిపి మాట్లాడుతూ గ్రామాలలోని సమస్యల పరిష్కారినికి ప్రజా ప్రతిని ధులతో అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. కాని మూడు నెలలకొకసారి నిర్వహించే సమావేశానికే అధికారులు సక్రమంగా రాకపోతే ఇక సమస్యలు ఎవరికి వివరిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడ అధికా రులు సమావేశాలకు హజరు కాలేదని, సభకు రాని అధికారులపై కలెక్టర్‌కు ఫి ర్యాదు చేస్తామని తెలిపారు. ఇక దశాబ్ది ఉత్సవాలను గ్రామాల్లో ఘనంగా నిర్వ హించి అన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కరంట్, నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దళితబందు, కులవృత్తుల వారిని ఆర్థిక సహాయం కోసం లబ్ధిదారుల ఎంపికను సక్రమంగా చేపట్టే విదంగా చూడాలని కోరారు. రవాణ సౌకర్యం సక్రమంగా చేపట్టాలని, మహిళా సంఘం గ్రూపులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంబందిత అధికారులు ప్రణాళిక బద్దంగా కృషి చేయాలన్నారు. అనంతరం జడ్పిటిసి శైలజా విజయనందరెడ్డి మాట్లాడుతూ సభలో లేవనెత్తిన సమస్యలను గ్రామాలకు వెళ్లి పరిష్కరించే విదంగా అధికారులు చర్యలు తీసుకోఆవలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పద్మావతి, వైస్ ఎంపిపి వెంకటేష్, పిఏసిఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

**ఘట్‌కేసర్, మే 30, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అధ్యక్షతన మంగళవారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ పావనియాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా రా ష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుందన్నారు. జూన్ 2వ తేదీ నుంచి 22 వరకు శతాబ్ది ఉత్సవాలలో రోజువారి కార్యక్రమాలను మున్సిపల్ నుంచి జరిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్ 2న పతాకావిష్కరణతో ఉత్సవాలను ప్రారంభించాలని, జూన్ 3న తెలంగాణ రైతు దినోత్సవం, 4న సురక్షా దినోత్సవం, 5న విద్యుత్ దినోత్సవం, 6న పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఉరూరా చెరువుల పండుగ, 9న సంక్షేమ సంబురాలు, 10న సుపరిపాలన దినోత్సవం, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న వైద్యారోగ్య దినోత్సవం, 15న పల్లె ప్రగతి దినోత్సవం, 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 17న గిరిజనోత్సవం, 18న మంచి నీళ్ల పండుగ, 19న హరితోత్సవం, 20న విద్యాదినోత్సవం, 21న ఆధ్యాత్మిక దినోత్సవం, 22న అమరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాలలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములై విజయవంతం చేసేలా అధికారులు చొరవ చూపాలని ఆమె కోరారు. ఈసమావేశంలో మున్సిపల్ కమీషనర్ పి.వేమనరెడ్డి, వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మేనేజర్ మర్రి అంజిరెడ్డి, కౌన్సిలర్లు బొక్క సంగీత, కొమ్మిడి అనురాధ, సల్లూరి నాగజ్యోతి, కడుపొల్ల మల్లేశ్, షేక్‌జహంగీర్, బేతాల నర్సింగ్‌రావు, కుతాడి రవీందర్, కోఆప్షన్‌సభ్యులు బొక్క సురేందర్‌రెడ్డి, బొట్టు అరుణ, పల్లె అరుణ, ఎస్‌కె.శౌకత్‌మియా, పర్యావరణ ఇంజనీర్ రాజేశ్, స్వచ్ఛసర్వేక్షన్ ఇంచార్జ్ యోగేశ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు సన్నీ, రాకేశ్, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ పావనియాదవ్, కమీషనర్ వేమనరెడ్డి, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి

## సిఐ మహేందర్‌రెడ్డికి పార్టీల నాయకుల సన్మానాలు



ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్‌పార్టీ, టిడిపి నాయకులు

**ఘట్‌కేసర్, మే 30, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మహేందర్‌రెడ్డికి రాజకీయపార్టీల నాయకులు సన్మానాలు చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మున్సిపల్ కాంగ్రెస్, మండల టిడిపి నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు. శాంతి, భద్రతల పరిరక్షణకు నాయకులు పోలీసులకు సహకరించి తగిన సమాచారం అందించాలని ఈసందర భంగా సీఐ కోరారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వేముల సంజీవగౌడ్, నాయకులు శిష్టా సూర్యనారాయణ రావు, పాటి సురేందర్‌రెడ్డి, మద్ది రాముగౌడ్‌లు కలువగా కాంగ్రెస్ పార్టీ నుంచి పట్టణ అధ్యక్షులు ఉల్లి అంజనేయులు, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, మాజీ వార్డుసభ్యులు మామిండ్ల ముత్యాలుయాదవ్, నాయకులు బొక్క సతి_రెడ్డి, కట్కూరి నర్సింగ్‌రావు, ఎం.ఎ.ఫారూఖ్, సురేశ్‌గౌడ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, కట్ట సుధాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**దోమ.మే 30 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఉదన్‌రావుపల్లి గ్రామానికి పుట్టి రవి రాజేంద్రనగర్ డిప్యూటి తహాసిల్దార్‌గా పనిచేస్తున్నాడు.వారి నాన్నమ్మ అయిన పుట్టి నర్సమ్మ (90) అనారోగ్యంతో ఆదివారం నాడు మృతి చెందింది.ఈ విషయం తెలుకున్న పర్గి మాజీ ఎమ్మెల్యే రాంమెహన్‌రెడ్డి సోమవారం నాడు గ్రామానికి చేరుకొని వారి నివాసానికి వెళ్ళి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో దోమ మాజి సర్పంచ్ రాంచం ద్రారెడ్డి, దోమ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి,పిఏసిఎస్ డైరెక్టర్ జాకటి వెంకటయ్య,రుక్మద్దీన్,తదితరులు పాల్గోన్నారు.

## నేడు శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో పర్యటించనున్న మంత్రి మల్లారెడ్డి

**శామీర్‌పేట, మే 30, ప్రభాతవార్త**
శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి బుధవారం ఉదయం పర్యటించనున్నారు. శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామంలో, అదే విధంగ మూడుచింతలపల్లి మండలంలోని పోతారం, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, ఉద్దెమర్రి, అద్రాస్‌పల్లి, జగ్గంగూడ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మంత్రి చేయనున్నారు. మంత్రి మల్లారెడ్డి ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఆయా గ్రామాల్లో మంత్రి సుడిగాలి పర్యటన చేయనున్నారు. శామీర్‌పేట మండల ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు వి.సుదర్శన్‌లు పేర్కొంటూ మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో మంత్రి మల్లారెడ్డి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగ మూడుచింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమాలను పురస్కరించుకుని మంత్రి మల్లారెడ్డి పర్యటిస్తున్నందున ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మూడుచింతలపల్లి మండల ఎంపిపి వి.హారికమురళీగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు జి.మల్లేశ్‌గౌడ్‌లు కోరారు. లక్ష్మాపూర్ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శ్రీరాములగుట్ట ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట సందర్భంగ ప్రత్యేక పూజలు జరుగుతున్నందున మంత్రి మల్లారెడ్డి పాల్గొననున్నారు.

## శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం

**శామీర్‌పేట, మే 30, ప్రభాతవార్త :** శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.ఆ తరువాత ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.దాతల సహకారంతో అమ్మవారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు,రాజీవ్‌రహదారిన వెళ్లె వివిధ గ్రామాల,ప్రాంతాల భక్తులు విచ్చేసి అన్నదానంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



.శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తజనం

## ఆర్ఆర్ఆర్‌లో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలి




నాగారం మున్సిపల్ పరిధిలో ఆర్ఆర్ఆర్‌లో భాగంగా చెత్తను సేకరిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

**కీసర,మే30,ప్రభాతవార్త:**
"మేరీ లైఫ్ మేరీ స్వచ్ఛ షహర్" లో భాగంగా ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్,రీయూస్,రీ సైకిల్) కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులోని సత్యనారాయణ కాలనీ,న్యూ హనుమాన్‌నగర్ కాలనీలలో ఆర్ఆర్ఆర్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్ని వార్డుల ప్రజలు పిల్లలు వారి చదువు పూర్తయిన లేదా అనవసర పుస్తకాలు ఆర్ఆర్ఆర్ సెంటర్‌ల వద్ద ఇచ్చి కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.మున్సిపల్ ప్రజలు ఇంట్లోని డ్రై వేస్ట్ సంబంధ వస్తువులైన పుస్తకాలు, అట్టముక్కలు,పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులు,వాడబడిన బట్టలు,కర్ర వస్తువులు,ప్లాస్టిక్ వస్తువులు 17వ వార్డు ఆర్ఆర్ఆర్ సెంటర్ వద్ద ఇవ్వడం జరిగింది. ఆర్ఆర్ఆర్ కార్యక్రమంలో భాగంగా అట్టముక్కలు వంటివి 3200 కిలోలు,బట్టలు 6800 కిలోలు,ప్లాస్టిక్ వస్తువులు 3900 కిలోలు,ఎలక్ట్రానిక్ వస్తువులు 1000 కిలోలు సేకరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీల అధ్యక్షులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు

**తాండూరు, మే 30, ప్రభాతవార్త :** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని టిపిసిసి ఉపాధ్యక్షులు, తాండూరు పీపుల్స్ డిగ్రీ కళాశాల అధ్యక్షులు రమేష్ మహారాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని మినీ ఖూకైలాస్ ఫంక్షన్ హాల్‌లో పీపుల్స్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల అధ్యక్షులు రమేష్ మహరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, శ్రద్ధతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యవర్గ సభ్యులు ధారాసింగ్, జనార్దన్‌రెడ్డి, వి. నర్సింలు, ప్రిన్సిపాల్ సత్యానంద్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎంపిపి



అవుశాపూర్‌లో పర్యావరణ పరిరక్షణ కొరకై ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ కావేరి తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, మే 30, ప్రభాతవార్త:**
పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతయని ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పర్యావరణ పరిరక్షణపై గ్రామ పంచాయతీ సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేసిన అనంతరం మాట్లాడుతూ ముంచుకొస్తున్న పర్యావరణ ముప్పు కారణంగా ఇప్పటికే జంతువులు, పక్షులు క్రమంగా అంతరించి పోతున్నాయని అన్నారు. అడవులు తరుగుతున్నాయి. నివాస ప్రాంతాలు పెరుగుతున్నాయని అన్నారు. పర్యావరణం అంటే గాలి, నీరు, చెట్లు జీవ జంతుజాతుల రూపంలో మన చుట్టూ ఉన్నతి ప్రకృతియని అన్నారు. ఇది మానవ మనుగడకు, అభివృద్ధికి పర్యావరణం దోహదపడుతుందని అన్నారు. పర్యావరణాణ్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వై. కావేరి, ఉప సర్పంచ్ ఏలుసాని అయిలయ్య యాదవ్, వార్డు సభ్యులు బి. శ్రీనివాస్ గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు నర్సింహ, నాయకులు ఏనుగు మశ్చేందర్ రెడ్డి, కంచర్ల వెంకట్ రెడ్డి, వామన్, సత్యనారాయణ, చింటు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు సర్పంచ్ ఆర్థిక సహాయం

**బొంరాస్‌పేట్/కొడంగల్ మే30ప్రభాతవార్త**
గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తానని సర్పంచ్ మహేందర్ అన్నారు.మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి,కొత్తూర్ గ్రామాల యువకుల మద్య మంగళవారం క్రికెట్ మ్యాచ్ సందర్బంగా మన గ్రామంలో క్రికెట్ అడే క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందించాలని యువకులు సర్పంచ్‌ను అడగడంతో స్పందించిన సర్పంచ్ మహేందర్ క్రీడలు అడుకునేందుకు అవసరమైయ్యే సామగ్రికి సంభందించి ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్బంగా క్రికెట్ కిట్‌నుమాజీ సర్పంచ్ గుణశేఖర్ యువకులకు అందించడంతో క్రీడాకారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

**గురుకులాకు ఎంపికైన రెయిన్ బో పాఠశాల విద్యార్థులు :**
బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రెయినన్ బో పాఠశాలకు చెందిన విద్యార్దులు శ్రీధర్,గౌతమ్,అదిత్య,ప్రవీణ్‌లు 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.రాఘవేందర్‌యాదవ్ తెలిపారు.ఇందుకుగాను గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్దులను ఆయన అభినందించారు.అలాగే కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్ నవీనసాయి పాఠశాల నుంచి గత ఏప్రిల్ 23న నిర్వహించిన 5వ తరగతి గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలకు పాఠశాల నుంచి 85 మంది విద్యార్దులు హజరుకాగా అందులో 60 మంది విద్యార్దులు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మొదటి విడతలో సీట్లు సంపాదించినట్లు పాఠశాల ప్రధానోపాద్యాయులు రవి తెలిపారు.ఇందుకుగాను విద్యార్దులను ఆయన అభినందించారు.అలాగే కొడంగల్ మండలంలోని రుద్రారంకు చెందిన ఆదర్శ విద్యాలయం నుంచి 5వ తరగతి గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు 22 మంది విద్యార్దులు హజరుకాగా అందులో 19 మంది విద్యార్దులు ఉత్తీర్ణత సాధించి సీట్లు సంపాదించినట్లు పాఠశాల ప్రధానోపాద్యాయులు వెంకటేష్ తెలిపారు.ఇందుకుగాను గురుకుల పాఠశాలకు ఎంపికైఐన విద్యార్దులను ప్రధానోపాద్యాయులు,ఉపాద్యాయ బృంధం అభినందించారు.



క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్‌లను అందిస్తున్న సర్పంచ్